క్లుప్తంగా

నాటు సారా విక్రేత అరెస్టు



నాటు సారాతో ఎక్సైజ్ అధికారులు అదుపులో నిందితుడు

సామర్లకోట: స్థానిక కుమ్మర వీధిలో నాటు సారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని శనివారం సాయంత్రం కాకినాడ నార్త్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ సీఐ కె రామమోహనరావు మాట్లాడుతూ గుబ్బల నూకరాజు కుమ్మర వీధిలో నాటు సారా విక్రయిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో తనిఖీలు చేయగా అతని వద్ద 20 లీటర్ల నాటు సారాను గుర్తించి స్వాధీనం చేసుకొన్నామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కాకినాడ కోర్టుకు తరలించగా 15 రోజులు రిమాండ్ విధించిన్నట్లు చెప్పారు. ఈ దాడిలో ఎస్సై ఎంవీవీబి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి రథానికి స్వాగతం



సామర్లకోటలో సత్యసాయి రథానికి స్వాగతం పలుకుతున్న భక్తులు

సామర్లకోట: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు సందర్భంగా చేపట్టిన రాష్ట్రవ్యాప్త రథయాత్ర శనివారం సామర్లకోటకు చేరుకుంది. సత్యసాయి ప్రేమ వాహిణి రథానికి భక్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి నాయకులు మాట్లాడుతూ ఏప్రిల్ 26వ తేదిన శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభమైన రథయాత్ర నవంబరు 24తో ముగుస్తుందన్నారు. శత జయంతి వేడుకలను పురస్కరించుకొని సేవా సమితి సభ్యులు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించనట్లు తెలిపారు. సత్యసాయి బాబా సేవలను భక్తులకు వివరిస్తామన్నారు. కాకినాడ జిల్లాలో మరో రెండు రోజుల యాత్ర కొనసాగుతోందన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం



కొండెవరంలోప్రతిష్ఠించిన అభయాంజనేయ విగ్రహం

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం గ్రామ సచివాలయం -2 వద్ద రమణయ్య బీడు యూత్ ఆధ్వర్యంలో శనివారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాన్ని వైభవంగా గ్రామంలో ఊరేగించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నసమారాధన కార్యక్రమంలో తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

4న ఉత్తర నక్షత్ర పూజలు

సామర్లకోట: స్థానిక గోదావరి నదీ తీరంలో వేంచేసియున్న అతి పూరాతన విష్ణు ఆలయంలోని లక్ష్మీ దేవి అమ్మవారి జన్మ నక్షత్రమైన ఉత్తర నక్షత్రంను పురస్కరించుకొని ఈనెల 4వ తేదిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బిక్కిన వెంకట్రాయ చౌదరి తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అమ్మవారి జన్మనక్షత్రం సందర్భంగా తెల్లవారు జామున పంచామృతాలతో సామూహిక అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం ఉంటుందన్నారు. పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొనాలన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి



ఉపాధి శ్రామికుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న దృశ్యం

కొత్తపల్లి: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న శ్రామికుల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని మండల సీఐటీయు నాయకులు కె.నాగేశ్వరరావు, కెవివి సత్యనారాయణ అన్నారు. మండలంలోని అమీనాబాద్‌లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం సీఐటీయూ నాయకులు పరిశీలించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత ఆరు వారాలగా బకాయిపడ్డ వేతనాలు వేంటనే విడుదలచేసి ఉపాధి శ్రామికులను ఆదుకోవాలన్నారు. పని ప్రదేశాల్లో కార్మికులకు కనీస సౌఖర్యాలు కల్పించాలని, తాగునీరు, పని ముట్లను అందించాలని, ప్రమాదవశాత్తు శ్రామికులు మృతి చెందితే ఎక్స్ గ్రేషియ రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయు నాయకులు పాల్గొన్నారు.

జనం ప...రేషన్!



పిఠాపురంలో జగ్గయ్య చెరువు కాలనీ

- కాళ్ల దగ్గర సౌకర్యాన్ని లాగేసిన కూటమి
- పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీ వాసుల తిప్పలు
- 3 కిలోమీటర్లు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సిన దుస్థితి

పిఠాపురం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇప్పటి వరకు ఆ కాలనీ వాసులు కాలు కదపకుండా రేషన్ తీసుకునే వారు. ఇంటి ముంగిటకు వచ్చి సైరన్ మోగించి పువ్వుల్లో పెట్టి ఇచ్చినట్టుగా అందేవి. నిత్యావసర సరుకులను ఇప్పుడు వారు మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి కల్పించింది కూటమి ప్రభుత్వం. **పిఠాపురం జగ్గయ్య చెరువులో 21, 22, 28 వార్డులకు చెందిన సుమారు 5,600 మంది జనాభా నివసిస్తున్నారు. సుమారు 2,000 వరకు రేషన్ కార్డులు ఉన్నాయి కాని ఈ కాలనీలో** రేషన్ షాపులు లేవు. సుమారు 30 ఏళ్ల క్రితం ఈకాలనీ ఏర్పడింది. అప్పటి నుంచి ఈకాలనీ వాసులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పిఠాపురం పట్టణంలోని రేషన్ దుకాణాలకు వెళ్లి రేషన్ తెచ్చుకునే వారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎండీయూ వామనాల ద్వారా ఇంటింటికీ రేషన్ అందించారు. ఎవ్వరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఇప్పటి వరకు వాహనాల ద్వారా ప్రజలందరికీ ఇళ్ల వద్ద రేషన్ అందేది. నేటి నుంచి పిఠాపురం పట్టణంలో ఉన్న రేషన్ షాపులకు వెళ్లి వీళ్లంతా రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో తీవ్ర వ్యయ ప్రయాసలు తప్పంటూ ప్రజల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు కిలోమీటర్లు దూరం వెళ్లాలంటే ఆర్థిక బారం తప్పదు. షాపు వద్ద పడిగాపులు తప్పనిసరి దీంతో ఆకాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు ముందు ఇంటి దగ్గర ఎవరుంటే వాళ్లు రేషన్ తీసుకునే వారమని, ఇప్పుడు ఎవరో ఒకరు పని మానుకుని షాపు వద్ద పడిగాపులు పడక తప్పదని వాపోతున్నారు. కాళ్ల దగ్గరకు వచ్చే సౌకర్యాన్ని కనిపించకుండా చేయడమేనా అభివృద్ధా అంటు ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నెలనెలా నరకమే



గతంలో చాలా ఏళ్లు ఇబ్బందిపడ్డాం. గత నాలుగేళ్లు ఇంటికి వచ్చి రేషన్ ఇవ్వడంతో చాలా ఇబ్బందులు తొలగిపోయాయి. దీంతో ఏవిధమైన శ్రమ ఉండేది కాదు. ఇప్పుడు వాహనాలను తొలగించేశారు. ఇక ప్రతీ నెలా కొన్ని రోజుల పాటు రేషన్ షాపుల చుట్టు ప్రదక్షిణలు చేయక తప్పదు. మా ఏరియాలో రేషన్ షాపు లేక పోవడంతో మేము పిఠాపురం పట్టణంలో ఉన్న ఏరేషన్ షాపుకి వెళ్లాలన్నా సుమారు మూడు కిలో మీటర్లు దూరం వెళ్లాల్సి ఉంటుంది. ఇది మాకు ప్రతీ నెలా నరకంగా మారుతుంది. ఇంకా అభివృద్ధి చేస్తామంటే ఏదో చేస్తారనుకున్నాం ఉన్నవి తీసేస్తుంటే ఇప్పుడు మాకు అర్థమవుతుంది.

ఎం. లక్ష్మి, జగ్గయ్య చెరువు కాలనీ, పిఠాపురం

యుద్ధం చేయడం లాంటిదే..



ఇంటింటికీ రేషన్ వాహనాలు ఉదయాన్నే వచ్చేసి రేషన్ ఇచ్చేవారు. దీంతో రేషన్ తీసుకుని ఇతర పనులు చూసుకునే వాళ్లం. ఇప్పుడు వాహనాలను ఆపేయడంతో పనులు మానుకుని రేషన్ తెచ్చుకోడానికి తిరగాల్సిందే. ఏళ్ల తరబడి ఉండే సమస్యకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పరిష్కారం చూపించారు. మా కాలు కదపకుండా రేషన్ మా ఇంటికే తెచ్చి ఇచ్చేవారు. దానిని ఇప్పుడు ప్రభుత్వం ఆపేయడంతో మాకు మళ్లీ సమస్యలు వచ్చిపడ్డాయి. ఇప్పుడు రేషన్ తెచ్చుకోవడం అంటే ఒక యుద్ధం చేయడం లాంటిదే.

నక్కా లక్ష్మి, జగ్గయ్య చెరువు కాలనీ, పిఠాపురం

వాహనాలు తీసేయడంతో ఇబ్బంది



రేషన్ అందించే వాహనాలను ఆపేయడం వల్లే మాకు ఇప్పుడు ఇబ్బంది వచ్చింది. సుమారు 2వేల రేషన్ లబ్ధిదారులు ఇప్పుడు మూడు కిలోమీటర్లు రేషన్ కోసం వెళ్లాల్సి వస్తుంది. వయసు పైబడిన వారు ఆడవారు ఇక చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. వీళ్లంతా ఒక్క సారే వెళితే గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. ఇంటి దగ్గర పనులు మానుకుని తిరగాల్సిందే. ఇంత మంది లబ్ధిదారులు ఉన్న చోటే రేషన్ షాపు ఏర్పాటు చేయాలి. లేక పోతే ప్రతీ నెల ఇబ్బందులు తప్పవు.

వీరబాబు, జగ్గయ్య చెరువు కాలనీ, పిఠాపురం.

ఖాళీ కంచాలతో నిరసన



ఖాళీ కంచాలతో నిరసన తెలియజేస్తున్న సామర్లకోట మున్సిపల్ కార్మికులు

సామర్లకోట: మున్సిపాలిటీలో పని చేస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం 25వ రోజుకు చేరింది. దీనిలో భాగంగా కారికులు ఖాళీ కంచాలతో తమ నిరసనను తెలియజేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఔసోర్సింగ్ కార్మిక సంఘ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పర్మినెంట్ ఉద్యోగుల కంటే కాంట్రాక్టు కార్మికులు ఎక్కువగా చేస్తున్నా గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికుల శ్రమ దోపిడికి గురవుతున్నారన్నారు. 15 సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, విధి నిర్వాహణలో కార్మికుడు మరణిస్తే రూ.10లక్షలు, అంగవైకల్యం పొందితే ఐదు లక్షలు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, స్కిల్ కార్మికులకు రూ.29,200, నాన్ స్కిల్ కార్మికుడుకి రూ.24,500 వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతీ నెల తమకు రూ.13వేలు చేతికి అందుతుందని, ఆ జీతంతో కుటుంబాన్ని ఏవిధంగా పోషించుకొవాలని ఆయన ప్రశ్నించారు. తమ కుటుంబాలు ఆకలితో అలమటించడం వలనే ఖాళీ కంచాలతో నిరసన తెలియజేస్తున్నామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ సమస్యల పట్ల స్పందించి ప్రజలకు మంచి సేవలు అందే విధంగా కృషి చేయాలన్నారు. ఆందోళనలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

యువతతో కలిసి పనిచేస్తా..!



వైఎస్సార్ సీపీ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి కరణం భాను

సామర్లకోట: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేస్తానని పార్టీ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి కరణం భాను అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో రాష్ట్ర స్థాయిలో పదవి కేటాయించారన్నారు. ఈ పదవికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు సిఫార్సు చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. యువతను ఒక తాటిపైకి తీసుకొని వచ్చి పార్టీ విజయానికి కృషి చేస్తానని చెప్పారు. యువతకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ద్రోహన్ని ఎండ కడతామన్నారు. ఏడాది గడిచినా యువతకు ఉద్యోగాలు రాక పోవడంతో పాటు ఉన్న ఉపాధి పోయిందన్నారు. వాలంటీర్లకు జీతాలు పెంచుతామని ఆశ చూపి వారిని తొలగించారన్నారు. నిరుద్యోగంతో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ యువతకు ఎండీయు వాహనాలు ఇస్తే వాటిని తొలగించి రోడ్డున పడవేశారని ఆరోపించారు. ఏడాది గడిచినా నిరుద్యోగ భృతి మాటే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకు వెళ్లతామని భాను తెలిపారు.



కరణం భానును సత్కరిస్తున్న కౌన్సిలర్లు

భానును అభినందించిన కౌన్సిలర్లు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి కరణం భానును శనివారం సాయంత్రం కౌన్సిలర్లు అభినందించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అందుబాటులో లేక పోవడంతో ఆయన తండ్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావును కలిసి కరణం భాను కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కౌన్సిలర్లు కరణం భానును సుబ్బారావు ఇంటి వద్ద సత్కరించారు.

జిల్లాకు ఆరు పతకాలు



విజేతలను అభినందిస్తున్న అధికారులు

పిఠాపురం: రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాక్సింగ్ బాలికల పోటీల్లో కాకినాడ జిల్లాకు ఆరు పతకాలు లభించినట్లు శనివారం కోచ్ లక్ష్మణరావు తెలిపారు. రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల బాక్సింగ్ పోటీల్లో ఓవర్ ఛాంపియన్‌షిప్‌లో కాకినాడ జిల్లా రెండో స్థానంలో నిలిచిందన్నారు. శనివారం విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలికల బాక్సింగ్ పోటీల్లో జే.ఐశ్వర్య, సూరి దీపిక సిల్వర్ మెడల్, పి.మహాలక్ష్మి సిల్వర్ మెడల్, యల్.లాస్య సిల్వర్ మెడల్, కాకడ హర్షిని బ్రాంజ్ మెడల్, సి.హెచ్ శ్వేత హన్సిక, ఎల్.రిషిక బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కే.పద్మనాభం ద్రోణచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావులు మెడల్స్ సాధించిన క్రీడాకారులను అభినందించారు.

బకాయి వేతనాలు విడుదల చేయాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

పిఠాపురం: ఉపాధి హామీ వేతనాలు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే.ఎస్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఉపాధి పర్యటనలో భాగంగా పిఠాపురం మండలం జములపల్లి, పి.తిమ్మాపురం, పి. రాయవరం గ్రామాల్లో శనివారం ఆయన ఉపాధి పనులను పరిశీలించారు. కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నంలో భాగంగా ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా కూలీల నోటితోనే ఈ చట్టం మాకు వద్దు అని చెప్పించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే నెలల తరబడి వేతన బకాయిలు విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. తక్షణమే ఉపాధి బకాయిలు వెంటనే విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని, పనిదినాలు 200రోజులు పెంచాలని, కూలి రేట్లు రూ.600లకు పెంచాలని, ఫే స్లిప్ గతంలో ఇచ్చే విధానంగా ఇప్పుడు కూడ ఇవ్వాలని, కార్మికులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షల భీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అవగాహనే పశువులకు రక్ష

- దూడల సంరక్షణ తప్పనిసరి
- పశువైద్యుల సూచనలు లేకుంటే రోగాల ముప్పు



ఆర్‌బిపట్నంలో దూడకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది



దూడకు డీవార్మింగ్ చేస్తున్న పశువైద్య సిబ్బంది

పెద్దాపురం: పాడి రైతులకు పశువుల పెంపకంపై అవగాహన లేకపోవడంతో దూడలు ఆనారోగ్యానికి గురవుతాయి. దూడలు బలంగా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో పెద్దాపురం పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ శనివారం వివరించారు. పాలిచ్చే ఆవులు, గేదెల పాదుగులో పాలన్నీ సేకరించడం చాలా మందికి అలవాటు. దీనివల్ల దూడల్లో వ్యాధి నిరోధక శక్తి లోపించి నీరసించిపోతుంటాయి. సరిగ్గా పెంచకపోతే 10 శాతం వరకు దూడల మరణాలు చోటు చేసుకుంటాయన్నారు. పుట్టిన ప్రతీ దూడను కూడా ఆరు నెలల లోపు సమీప పశు వైద్యాధికారిని సంప్రదించి, చెవి పోగు వేయించి, రిజిస్టర్ చేయించుకోవాలి.

• జాగ్రత్తలు పాటించాలి

పుట్టిన దూడలకు మొదటి వారం రోజుల వరకు తల్లి పశువు నుంచి రెండు పూటలా జున్ను పాలు పట్టించాలి. జున్నుపాలలో ఉండే రోగ నిరోధక శక్తి దూడలకు కూడా చేరి వ్యాధులు త్వరగా వ్యాపించవు. కొందరు తల్లి పశువు నుంచి పాలు మొత్తం తీయడంతో దూడలకు పాలు చాలక నీరసించిపోతాయి. పశు పెంపకందారులు ఈ విషయాన్ని గుర్తించి దూడలకు కావాల్సినన్ని పాలు వదిలేయాలి. సాధారణంగా మొదటి మూడు నెలల్లో దూడ 30 కేజీలు బరువు ఉంటుంది. పది శాతం పాలు ఇవ్వవలసి ఉంటుంది. అనగా ఉదయం 1.5 లీటర్లు, సాయంత్రం 1.5 లీటర్ల పాలు ఇవ్వవలసి ఉంటుంది. మూడు నెలల తరువాత దూడ పచ్చగడ్డి మీదకు మళ్లుతుంది కాబట్టి అనంతరం నుంచి పాలు ఇవ్వడం నెమ్మదిగా తగ్గించవచ్చు.

• అతిసార వ్యాధి

దూడలు అపరిశుభ్రమైన పాత్రలు, షెడ్లలో తడి, బురద ఉండటం, ఆహారాన్ని పరిమితికి మించి పెట్టడంతో అతిసార వ్యాధి సోకుతుంది. దుర్వాసనతో కూడిన నీళ్లు తాగితే విరేచనాలతో దూడలు నీరసించి, బరువు కోల్పోతాయి. 1-3 వారాల దూడలు ఈ వ్యాధికి అధికంగా లోనవుతాయి.

• చికిత్స

వైద్యుని సలహాతో సల్ఫా, యాంటిబయాటిక్స్, ఐ/వి ఫ్లూయిడ్స్ ఇస్తూ రీ హైడ్రేషన్ రాకుండా చూసుకోవాలి. దూడ పుట్టిన అరగంటలోపు జున్నుపాలు పట్టించాలి. దూడలకు పరిమితికి మించి పాలను పట్టించకూడదు. షెడ్లను పరిశుభ్రంగా, గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేటట్లు ఉంచుకోవాలి.

• తెల్లపారుడు

కొన్ని రకాల బ్యాక్టీరియాలతో లేగ దూడలకు ఈ వ్యాధి సోకుతుంది. దూడలు విపరీతంగా తెల్లగా పారుతాయి. ఆకలి మందగిస్తుంది. చర్మం పాడిగా, గరుకుగా ఉంటుంది. కాళ్లలో సత్తువ లేక నీరసించి పోతాయి. పశు వైద్యుని సలహాతో సల్ఫా యాంటి బయాటిక్స్, ఐ/వి ఫ్లూయిడ్స్ వాడాలి.

• రక్త విరేచనాలు

ఎక్కువ పాలు తాగించడంతో సూక్ష్మజీవులు కోక్సిడియా ఆశించి ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సోకిన దూడల మలం రక్తంతో కూడి ఉంటుంది. పశుశాలను శుభ్రంగా ఉంచడంతో పాటు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. సల్ఫా, ఏంప్రోలియం యాంటిబయాటిక్స్‌ను వాడుతూ డీహైడ్రేషన్ రాకుండా ఐ/వి ఫ్లూయిడ్స్ కూడా ఇవ్వవలసి ఉంటుంది.

• నిమోనియా (ఊపిరితిత్తుల వ్యాధి)

బ్యాక్టీరియా, వైరస్‌ల ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. షెడ్లలో తేమ ఎక్కువగా ఉండడం, చలిగాలుల నుంచి సరైన రక్షణ లేకపోవడంతో ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన దూడలకు జ్వరం వచ్చి, శ్వాస ఇబ్బందికరంగా ఉంటుంది. ఆకలి మందగిస్తుంది. కళ్లు, ముక్కు నుంచి నీరు కఫం వస్తుంది. దూడలు ఎక్కువగా చనిపోయే అవకాశం కూడా ఉంటుంది.

• చికిత్స: పశుశాలలను శుభ్రంగా ఉంచాలి. చలిగాలుల నుంచి దూడలను రక్షించాలి. సల్ఫాతో పాటు లింకోమైసిన్ లాంటి యాంటిబయాటిక్స్‌ను, ఐ/వి ఫ్లూయిడ్స్ వైద్యుని సలహాతో వాడాలి.

• కీళ్ల జబ్బు – బొడ్డు వాపు

దూడ బొడ్డు సంచికి సూక్ష్మ జీవులు ఆశించడంతో ఈ వ్యాధి సోకుతుంది. బొడ్డు నరం సరిగా వేరు చేయనప్పుడు, కత్తిరించడంలో అజాగ్రత్తలతో ఈ వ్యాధి వ్యాపిస్తుంది. దుర్వాసనతో కూడిన చీము కారుతుంది. సూక్ష్మజీవులు కీళ్లకు కూడా వ్యాపించి కీళ్ల వాతం వస్తుంది. పుట్టిన వెంటనే దూడ బొడ్డు నరాన్ని టింక్చర్ అయోడిన్ ముంచిన దూదితో అద్దాలి. బొడ్డు ఊడే వరకు పరిశుభ్రమైన స్థలంలో దూడను ఉంచాలి.

• అంతర పరాన్నజీవులు

అనేక రకాల పురుగులు జీర్ణాశయాన్ని, ఊపిరితిత్తులను ఆశించడంతో దూడలు నీరసిస్తాయి. అశ్రద్ధ చేస్తే మరణాలు చోటు చేసుకుంటాయి. ఈ పురుగులు పేడ, నేల, నీటి ద్వారా తిరిగి ఆశిస్తాయి. దూడలకు ఏలిక పాముల నివారణ మందును 7వ, 15వ, 30వ, 60వ, 90వ రోజులోనూ, ఆ తరువాత నుంచి ప్రతీ మూడు నెలలకు ఒకసారి వంతున సంవత్సరం పాటు వేయించాలి. ఏ పశువుకైనా ప్రతీ ఆరు నెలలకు పాముల మందు వేస్తే దూడ, గేదె ఆరోగ్యంగా ఉంటాయి.

వ్యాధి నిరోధక టీకాలు



దూడ పుట్టిన 1వ రోజు ధనుర్వాతం ఇంజక్షన్ ఇప్పించాలి. 4వ రోజు ప్రిపలిన్, విటమిన్-ఏ ఇంజక్షన్ ఇప్పించాలి. 4వ మాసంలో సంకర జాతి దూడలకు థైలేరియా వ్యాధి నిరోధక టీకా ఇప్పించాలి. 6వ మాసంలో గొంతు వాపు, జబ్బ వాపు టీకాలు వేయించాలి. ప్రతీ పెయ్యి దూడకు కూడా 4-8 నెలల లోపు బ్రూసెల్లోసిస్ టీకాను వేయించాలి. ప్రతీ ఆరు నెలలకు గాళ్ల వ్యాధి నిరోధక టీకాలు కూడా వేయించాలి. ఈటీకాల కోసం పాడి రైతులు తమ దగ్గరలోని పశువైద్య సిబ్బందిని సంప్రదించాలి.

డాక్టర్ తుమ్మల రామస్వామి, అసిస్టెంట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, పెద్దాపురం

పార్టీకి వెన్నుదన్నుగా ఉంటా



వంగా గీతను కలిసిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ సహాయ కార్యదర్శి భూషణం

పిఠాపురం: వైఎస్సార్ సీపీ పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ సహాయ కార్యదర్శిగా నూతనంగా నియమించబడ్డ ఉలవల భూషణం అన్నారు. ఆయనకు కేటాయించిన సందర్భంగా శనివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్‌ను పిఠాపురం పార్టీ కార్యాయలంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి రావడానికి ఎంతో సహకరించిన వంగా గీతకు వెన్నుదన్నుగా ఉండి ఆమె సూచనల మేరకు పార్టీ బలోపేతంకు కృషి చేస్తానని ఆయన అన్నారు.

కౌన్సిల్ చైర్మన్‌గా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్



బొజ్జా రామయ్యను సత్కరిసున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

పిఠాపురం: స్థానిక పిఠాపురం మున్సిపాలిటీ కౌన్సిల్ చైర్మన్‌గా వైఎస్సార్ సీపీ సీనియర్ కౌన్సిలర్ బొజ్జా రామయ్య (పెదకాపు) శనివారం బాధ్యతలు నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి ఆదేశాల మేరకు సీనియర్ నాయకుడు అయిన ఆయనను మున్సిపల్ కౌన్సిలర్లు అందరు స్వాగతం పలికి ప్యానల్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వగా ఆయన సారధ్యంలో సభను హుందగా నడిపించారు. దీంతో ఆయనను పలువురు కౌన్సిలర్లు, అధికారులు అభినందించారు.

ఆలయ భూమి వేలం పాట

కొత్తపల్లి : స్థానికంగా వేంచేసియున్న వేణుగోపాల స్వామి దేవస్థానం భూములు మూడు సంవత్సరాలకు కౌలు వేలం పాటను 4న నిర్వహించనున్నట్లు కార్యనిర్వహధికారి ధనలక్ష్మి శనివారం తెలిపారు. కొత్తపల్లిలో సర్వేనెంబర్ 202/1, 202/3లో 7-22, వాకతిప్పలో సర్వేనెంబర్ 428/2, 420/9లో 3-34, కొత్తపల్లిలో సర్వేనెంబర్ 9లో 1-54, సర్వేనెంబర్ 238లో 1-34, సర్వేనెంబర్ 26లో 0-92కు ఈవో ఆధ్వర్యంలో వేలంపాట జరుగుతుందన్నారు. ఆలయానికి సంబంధించి 14 ఎకరాల 36 సెంట్లు సాగు భూమికి వేలంపాట బుధవారం ఉదయం11.30 గంటలకు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం జరుగుతుందన్నారు.

ప్రేమాభిమానాలను పెంపొందించుకోవాలి

పెద్దాపురం: మూగ జీవుల పట్ల ప్రతీ ఒక్కరూ ప్రేమాభిమానాలను పెంపొందించుకోవాలని ప్రకృతి, జంతు ప్రేమికుడు నవీన్ రాజు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శనివారం పీసీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా జంతువుల పట్ల ఏ విధంగా మలచుకోవాలనే అంశంపై నవీన్‌రాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పెంపుడు జాతులు, వాటి పట్ల ఎలా మెలగాలో విషయాలను వివరించారు. నృత్యం, కర్రసాము, కోలాటం, కరాటే, వ్యాయామం వంటి అంశాలపై టీచర్ల బృందం యోగేష్, లోకేష్‌లు నేర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్, కార్యదర్శి రొంగల అరుణ్, అమత, నమ్రత, భాష, సందీప్, లలిత పాల్గొన్నారు.